



జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




ఆదివారం 08 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 279 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలులో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలి: మంత్రులు

### "ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే లక్ష్యం"





సందేశం టైమ్స్, నల్గొండ, మార్చి ౦8: ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో నల్గొండ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికపై నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కింద పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, రైతుల సమస్యలు, మహిళలు చిన్నారుల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను సోమవారం లోపు రాష్ట్ర ప్రభుత్వం క్లియర్ చేయనుందని, ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా ఐటిపాముల గ్రామంలో ౫౦ మంది మహిళా సంఘ సభ్యులకు ౫౦ లక్షల రూపాయలతో స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ౨౦౨౮ జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ ద్వారా సాగునీరు అందిస్తామని, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు నెలలో ౧౫ రోజులు క్షేత్ర స్థాయిలో ఉండి ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని సూచించారు. మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలు పేదలకు నేరుగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు యూరియా సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నల్గొండ మేయర్ చైతన్య బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు మాట్లాడగా, నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మార్చి 6 నుంచి జూన్ ౧౨ వరకు ౯౯ రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు స్థాయిలలో అమలు చేయనున్నట్లు వివరించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో అధికారులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సహా మూడు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ నిధులు రైతుల ఖాతాల్లోకి నేరుగా బదిలీకి చర్యలు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి ౦8: వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి అవసరమైన విధివిధానాలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ముందస్తు చర్యలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రైతులు కొనుగోలు చేసిన వ్యవసాయ యంత్రాలకు ౪౦ శాతం సబ్సిడీని కంపెనీలకు అందించే విధానం అమల్లో ఉందని, దానికంటే రైతులకు నేరుగా సబ్సిడీ చేరే విధంగా కొత్త విధానాన్ని రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు నాటికి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించి రెడ్కో సంస్థ సహకారంతో మొదట జంగారెడ్డిపల్లి, జనంపేట రైతు వేదికలలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని ౧౬౦౦ రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచాలని, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని, ముఖ్యంగా మక్క పంటకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం, నేలలో తేమ నిల్వ ఉండటం, దక్షిణ పశ్చిమ రుతుపవనాలు సాధారణంగా ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సుమారు ౬౦.౬౦ లక్షల హెక్టార్లలో సాగు జరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్–౨౦౨౬ సీజన్‌కు రాష్ట్రానికి ౧౧.౫౦ లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి వెల్లడించారు.



## ఈ నెలాఖరులోగా లక్ష ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి ౦8: రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు ౩.౬౦ లక్షల ఇళ్లను మంజూరు చేయగా, అందులో లక్ష ఇళ్లకు ఈ నెల ౩౧లోపు గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలో తన కార్యాలయం నుంచి ప్రజాపాలన–ప్రగతి నివేదికలో భాగంగా ౯౯ రోజుల కార్యాచరణపై జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, ఇప్పటికే మంజూరు చేసిన ఇళ్లలో సుమారు ౨౦ శాతం వరకు గ్రౌండింగ్ కాలేదని, అలాంటి ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సమ్మతి తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సూచనలతో మార్చి ౩౧లోపు అన్ని ఇళ్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తికి దగ్గరగా ఉన్న ఇళ్లను సమన్వయం చేసి జూన్ చివరినాటికి పూర్తయ్యేలా చూడాలని, ఏప్రిల్‌లో రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగే సమయానికి మొదటి దశ ఇళ్ల నిర్మాణం పూర్తికి చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల వల్ల లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని, అవసరమైతే కలెక్టర్లతో సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల సరఫరాను పెంచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని, అవసరమైతే ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉచిత ఇసుక అందిస్తోందని, లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే మంజూరు చేసిన ఇళ్లకు ఒకటి లేదా రెండు విడతల చెల్లింపులు చేసిన తర్వాత నిలిపివేసిన చెల్లింపులను వెంటనే క్లియర్ చేయాలని, లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను మార్చి ౩౧లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని మంత్రి పేర్కొంటూ, అధికారులు అంకితభావంతో పనిచేసి ౯౯ రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



## డెలావర్ గవర్నర్ మాట్ మేయర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 08: అమెరికా దేశంలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, విద్యా రంగాల్లో సంస్కరణలు, డేటా రక్షణ, యూనివర్సల్ హెల్త్ కేర్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. డెలావర్ రాష్ట్రంలో పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఇండ్ల నిర్మాణం, రుణమాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ఎలా అమలు చేస్తున్నామో గవర్నర్ మాట్ మేయర్ ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే తెలంగాణ ప్రతినిధుల బృందంతో డెలావర్ రాష్ట్రాన్ని సందర్శించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. భవిష్యత్తులో తెలంగాణ మరియు డెలావర్ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు మరింత బలపడాలని గవర్నర్ మాట్ మేయర్ ఆకాంక్షించారు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గద్దర్ ఫిల్మ్ అవార్డుల జాబితా అందజేత



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి ౦8: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డుల జాబితాను జ్యూరీ సభ్యులు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జ్యూరీ సభ్యులు అవార్డులకు ఎంపికైన చిత్రాలు, నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను డిప్యూటీ ముఖ్యమంత్రికి సమర్పించారు. ఈ సందర్భంగా సినీ రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి గద్దర్ పేరుతో అవార్డులు అందించడం గౌరవకరమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కళాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు మరియు జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళల హాకీ టోర్నమెంట్‌కు హైదరాబాద్‌లో ఘన ఏర్పాట్లు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 08: మహిళల హాకీకి మహత్తర ప్రోత్సాహం అందిస్తూ అంతర్జాతీయ మహిళల హాకీ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్‌ను గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లపై గచ్చిబౌలి స్టేడియంలో పోటీల్లో పాల్గొంటున్న ఎనిమిది జట్ల కెప్టెన్లతో కలిసి ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడ అయిన హాకీకి పునర్వైభవం తీసుకురావడం, క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఈ అంతర్జాతీయ మహిళల హాకీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జాతీయ, అంతర్జాతీయ క్రీడా ఫెడరేషన్ల టోర్నమెంట్లను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ క్రీడాశాఖ సహకారంతో గచ్చిబౌలి హాకీ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశామని తెలిపారు. దాదాపు రెండు నెలల పాటు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చేసిన కృషి ఫలితంగా ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ గచ్చిబౌలిలో నిర్వహించబడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎనిమిది జట్ల కెప్టెన్లు తెలంగాణ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆతిథ్యం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గచ్చిబౌలి ఆస్ట్రో టర్ఫ్ మైదానం అద్భుతమైన హాకీ మ్యాచ్‌లకు వేదిక కానుందని వారు అభిప్రాయపడ్డారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

## 124 తుపాకులు పోలీసులకు అప్పగింపు – శాంతియుత మార్గంలో సమస్యల పరిష్కారానికి సీఎం పిలుపు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 08: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహ లొంగిపోయారు. హైదరాబాద్‌లోని ఐసీసీసీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు కలిపి మొత్తం 130 మంది లొంగుబాటు అయ్యారు. వీరు పోలీసులకు మొత్తం 124 తుపాకులను అప్పగించారు. అందులో ఒక ఇన్సాస్ ఎల్ఎంజీ రైఫిల్, 31 ఏకే-47 రైఫిళ్లు, 21 ఇన్సాస్ రైఫిళ్లు, 20 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 18 త్రీనాట్ త్రీ రైఫిళ్లు, మరో 33 ఇతర తుపాకులు ఉన్నాయి. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని ముందుకు వచ్చి లొంగిపోయారని తెలిపారు. వారి ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా ఆర్థిక సహాయం, ఇతర వసతులు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, పోలీసు ఉన్నతాధికారులు వారిలో నమ్మకం కలిగించారని అభినందించారు. శాంతియుత మార్గాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని భారతదేశం నమ్ముతుందని, మహాత్మా గాంధీ కూడా శాంతియుత పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని గుర్తు చేశారు. ఎలాంటి సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న గణపతితో పాటు ఇతర మావోయిస్టులు కూడా లొంగిపోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇటీవల లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు దేవ్‌జీ, దామోదర్ తదితరులతో సమావేశమైనప్పుడు వారు కొన్ని ప్రతిపాదనలు పెట్టారని, వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బుల్లెట్ కంటే బ్యాలెట్ ద్వారా సమస్యలు పరిష్కరించాలని నమ్మి ముందుకు వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు తెలంగాణలో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు. లొంగిపోయిన వారికి మెరుగైన వైద్యసేవలు, ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇళ్లు కల్పిస్తామని, ఆర్థిక ప్యాకేజీ పెంపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకేసారి ఇంతమంది ఆయుధాలతో లొంగిపోయిన ఘటనలు లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో హింసకు చోటు లేదని, ప్రజాస్వామ్య మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలని అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లకు సూచించారు. అవసరమైతే చట్టపరిధిలో కేసుల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేసి సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.







# మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మకు భట్టి విక్రమార్క సత్కారం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 08: మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళుతున్న జిష్ణు దేవ్ వర్మను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులోనూ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలు అందుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో పరస్పరం రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కూడా స్వల్పంగా చర్చించారు.



# సంగారెడ్డి: అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణాపై కఠిన చర్యలు – జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశాలు

సంగారెడ్డి, మార్చి 8 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, గ్రావెల్ రవాణాను కట్టుదిట్టంగా నియంత్రించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులు ఆదేశించారు.శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భజల శాఖల అధికారులతో అక్రమ రవాణా నివారణ చర్యలపై చర్చ జరిగింది.జిల్లాలో వాల్టా చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, అక్రమ రవాణా వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని, ఫిల్టర్ సాండ్ అక్రమ రవాణా మరియు కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కలెక్టర్ నారాయణఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ల ద్వారా ప్రజలకు నిర్ణీత ధరలకు నాణ్యమైన ఇసుక అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జిల్లాలో ఇసుక కొరత లేదని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎస్ఐఆర్ నమోదు, కుల, ఆదాయ, నివాస ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని అధికారులు సూచించారు.అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా భూగర్భ శాఖ అధికారి ఎం. రఘుబాబు, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల అధికాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# పటాన్చెరువులో పోష్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం





పటాన్చెరు మర్చి 8( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )పటాన్చెరువు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేసే సిబ్బందికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం (POSH Act) పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సౌజన్య మాట్లాడుతూ, మహిళలపై లైంగిక వేధింపులు చట్టపరంగా తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదు కమిటీ (ICC) ఏర్పాటు చేయడం తప్పనిసరి అని, అలాగే పాక్సో చట్టం, డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ ద్వారా మహిళలు, బాలలకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని వివరించారు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ పోష్ యాక్ట్ అమలు విధానం, ఫిర్యాదు చేసే ప్రక్రియ, లోకల్ కమిటీ పాత్ర, She-Box పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ ఫిర్యాదు విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జయరాం, మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త పల్లవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెల్ప్‌లైన్ నంబర్లు మరియు పోష్ యాక్ట్ పోస్టర్లను కూడా ఆవిష్కరించారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ చేసిన ఎస్సై నవీన్ కుమార్






సందేశం టైమ్స్, అనంతగిరి, మార్చి 08: అనంతగిరి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్థానిక ఎస్సై నవీన్ కుమార్ పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. జీవితంలో విజయాన్ని సాధించాలంటే పట్టుదల, కష్టపడి చదవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# అమరావతి: రాజధాని గ్రామాల్లో 42 శ్మశాన వాటికల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం

అమరావతి, మార్చి 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు పెంచుతూ, శ్మశాన వాటికల అభివృద్ధి కొనసాగుతున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో 42 ప్రాంతాల్లో అన్ని అవసరమైన వసతులతో శ్మశాన వాటికల నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. నారాయణ మాట్లాడుతూ, రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా కమ్యూనిటీ హాల్స్, శ్మశాన వాటికల కోసం ప్రత్యేక ఏర్పాట్లను కూడా ప్రభుత్వంగా చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమం ద్వారా గ్రామస్థులు సౌకర్యంగా సేవలు పొందగలిగేలా చూడాలనడంలో ప్రభుత్వం కట్టుబడిందని మంత్రి పేర్కొన్నారు.

# కాళేశ్వరం త్రివేణి సంగమంలో డా. టి. వెంకట రామారావు అస్థికల నిమజ్జనం



సందేశం టైమ్స్, కాళేశ్వరం, మార్చి ౦8: ప్రముఖ వైద్యులు డా. టి. వెంకట రామారావు గారి పవిత్ర అస్థికలను కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో కాళేశ్వరం త్రివేణి సంగమం జలాల్లో నిమజ్జనం చేసి చివరి సంస్కారాలను నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయులు కలిసి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమాన్ని డా. జితేందర్ రావు తనుగుల భక్తి భావంతో నిర్వహించారు. కార్యక్రమంలో డా. టి.ఆర్.కె. రావు, పురుషోత్తం, సదాశివ రావు, వి. శరత్ కుమార్, రమణ, ధినేష్, ప్రణీత్ తదితరులు పాల్గొని డా. టి. వెంకట రామారావు గారికి కన్నీటి నివాళులు అర్పించారు. త్రివేణి సంగమంలోని పవిత్ర జలాల్లో అస్థికలను నిమజ్జనం చేసిన సందర్భంగా కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. తన దయ, జ్ఞానం, గౌరవప్రదమైన జీవన విధానంతో అనేక మందికి ప్రేరణగా నిలిచిన డా. టి. వెంకట రామారావు గారి జ్ఞాపకాలు ఎప్పటికీ తమ హృదయాల్లో నిలిచిపోతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపల్లెవాడ గ్రామంలో శుభ్రత కార్యక్రమాలు





సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి ౦8: మధిర నియోజకవర్గంలోని ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామంలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక ౯౯ రోజుల కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి మరియు శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుభ్రత కార్యక్రమం చేపట్టడంతో పాటు డ్రైనేజీల్లో పూడిక తొలగింపు, అంగన్వాడీ కేంద్రంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు, గ్రామ ప్రజలకు టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ మడిపల్లి అంబిక రామ్ ప్రసాద్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని గ్రామ ప్రజలకు సూచించారు.

# హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 8: హైదరాబాద్ నగరాన్ని క్లీన్ సిటీగా మార్చేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం క్యూర్ (Core Urban Region) పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నగరంలో ప్రతిరోజు ఇంటింటికి చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలని సీఎం స్పష్టం చేశారు. చెత్త సేకరణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ఒక్కో వాహనానికి ఒక ప్రాంతాన్ని కేటాయించి చెత్త సేకరణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే గుర్తించిన కొత్త డంప్ యార్డులను వీలైనంత త్వరగా సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం తెలిపారు. కార్పొరేషన్‌ల వారీగా దగ్గరలోని డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నిర్మాణ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ డంప్ చేయకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, నగరంలో అపరిశుభ్రత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అలాగే దోమల నివారణ చర్యలు చేపట్టి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నగరవాసులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖాసింపూర్‌లో మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు






జహీరాబాద్ మర్చి 8( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) జహీరాబాద్ మండలంలోని ఖాసింపూర్ గ్రామంలో మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి మహిళలు ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మాట్లాడుతూ, లింగ వివక్ష లేని సమాజం నిర్మాణం కావాలంటే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, రాజకీయ రంగాలలో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలకు తమ స్వంత గళం ఉందని, ఆత్మవిశ్వాసం మరియు ఆత్మగౌరవంతో ప్రతి సవాలను ఎదుర్కొంటూ హక్కులు, బాధ్యతలను గ్రహిస్తూ ముందుకు సాగడమే అసలైన మహిళా సాధికారత అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు చంద్రకళ, స్వప్న, ఈశ్వరమ్మ, భాగ్యలక్ష్మి, బుజ్జమ్మ, పారమ్మ, వినోద, భరతమ్మ, సిద్దమ్మ, సువర్ణ, సురేఖ, సంగమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





హైదరాబాద్, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఐఏఎస్ అధికారులు, సచివాలయ మహిళా సీనియర్ అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు, చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళల సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని పలువురు అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, మహిళా ఉద్యోగులు ఆనందంగా పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# జన్మదిన సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ చైర్మన్ వై పండరి



నారాయణ ఖేడ్ మర్చి 8( సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్చార్జి టీ చంద్రశేఖర్)సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్గిద్ది మండల కేంద్రంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్, సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి జన్మదిన వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు పరీక్షల సమయంలో అవసరమైన పెన్నులు,పెన్సిల్లు,స్కేలు,హాల్ టికెట్ కవర్లు,చాపమార్లు పంపిణీ చేశారు.విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా రాయాలని, క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు సాధించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, కాశీరాం, విజేందర్ రెడ్డి, మారుతి జ్యోతి, మల్లేశ్వరి మరియు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వారికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ ఇంచార్జ్ భీమా సేన, కేవీపీఎస్ మండల నాయకుడు గణపతి, వార్డ్ సభ్యుడు తుకారం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని పాల్గొన్న వారు తెలిపారు.

# అల్లాదుర్గంలో నూతన వార్డ్ మెంబర్లకు శిక్షణ తరగతులు ముగింపు



మెదక్ మర్చి 8( సందేశం టైమ్స్ అల్లాదుర్గ్ మండల్ రూరల్ రిపోర్టర్ జి కుమార్)మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో నూతనంగా ఎన్నికైన వార్డ్ మెంబర్లకు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మరియు కాలేజ్‌లో మార్చి ౩ నుంచి ౭ వరకు గ్రామాలను రెండు భాగాలుగా విభజించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరి రోజు శిక్షణ పొందిన వార్డ్ మెంబర్లకు ఆయా గ్రామాల సెక్రటరీలు మరియు ఎంపీడీవో చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ శిక్షణలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, పన్నులు సకాలంలో చెల్లించడం, తడి చెత్త–పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నియంత్రణ, గ్రామంలో సమస్యలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధిలో వార్డ్ మెంబర్ల పాత్ర మరియు బాధ్యతలపై కూడా అధికారులు వివరంగా సూచనలు ఇచ్చారు.

# మనూరు మండల మహిళా సమైక్య బలోపేతానికి పలు సబ్ కమిటీల ఏర్పాటు



నారాయణ ఖేడ్ మర్చి 8( సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్చార్జి టి చంద్రశేఖర్ )సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండల మహిళా సమైక్యంలో సమైక్య బలోపేతం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ సిఆర్పీలు హాజరై సమైక్యను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను అందించారు. సమైక్య పనులు సక్రమంగా సాగేందుకు బాధ్యతలను పంచుకునే ఉద్దేశంతో పర్యవేక్షణ కమిటీ, సామాజిక పర్యవేక్షణ కమిటీ, బ్యాంకు లింకేజీ కమిటీ, జీవనోపాధుల కమిటీ, ఆస్తి ధ్రువీకరణ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి కమిటీకి ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ సమైక్య కార్యకలాపాలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షించడం, సభ్యులకు మార్గనిర్దేశం చేయడం, మహిళల అభివృద్ధి మరియు జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో సీనియర్ సిఆర్పీలు వై సాయి లీల, వి చిన్నమ్మ, మండల సమాఖ్య ఏపీఎం అనంతయ్య కమిటీల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు, సిబ్బంది మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో మహిళా సర్పంచులకు అవగాహన కార్యక్రమం




సంగారెడ్డి మర్చి 8( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్కోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో మహిళా సర్పంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం పాటించడం, ఆర్థిక స్థిరత్వం సాధించడం, విద్య, వైద్యం మరియు మహిళా సాధికారతకు సంబంధించిన పలు అంశాలపై వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధిగమించేందుకు అవసరమైన సాధన, కృషి, హక్కులు, సమానత్వం మరియు మహిళల నాయకత్వాన్ని పెంపొందించడం ద్వారా సమాజంలో ఉన్న వివక్షతలను నిర్మూలించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కోప్ సంస్థ సంగారెడ్డి జిల్లా సమన్వయకర్త మానేయ్యతో పాటు సిబ్బంది సావిత్రి, రామగౌడ్ పాల్గొన్నారు.

# సంగారెడ్డి: ఉన్నత లక్ష్యాలతో కృషి చేస్తేనే విజయాలు – జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య





సంగారెడ్డి, మార్చి 8 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో ఐదు నెలల శిక్షణలో పొందిన నైపుణ్యాలను ఆధారంగా చేసుకొని, ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య విద్యార్థులకు సూచించారు. శనివారం బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్, గ్రూప్స్, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్ పరీక్షలకు శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు కలెక్టర్ తన నిధులతో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు.కలెక్టర్ మాట్లాడుతూ, నోటిఫికేషన్లు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా, శిక్షణలో పొందిన జ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా ప్రతి పరీక్షకు హాజరై తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.నాణ్యమైన విద్యతో మంచి ఫలితాలు సాధించాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, సంగారెడ్డి, మార్చి 8: జాతీయ విద్యా విధానం–2020 లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన, వృత్తి ఆధారిత విద్య అందించడంతో పాటు మంచి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కేంద్ర నోడల్ అధికారి అమన్ శర్మ సూచించారు. శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో పీఎం శ్రీ పాఠశాలల అమలు పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అమన్ శర్మ, జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగ్గా ఉన్నాయని ప్రశంసిస్తూ, విద్యార్థుల్లో జీవిత నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, 10వ, 12వ తరగతి ఫలితాలు మెరుగుపడేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.జిల్లాలో 44 పాఠశాలల్లో పీఎం శ్రీ పథకం అమలవుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు వివరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, టెలిస్కోపులు, డ్రోన్లు వంటి ఆధునిక పరికరాల వినియోగం ద్వారా విద్యార్థులకు సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం పెంపొందుతోందని, కొత్త విద్యా అవకాశాలు కలుగుతున్నాయని తెలిపారు.సమావేశంలో రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్లు మరియు పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




# జోగిపేట్ మున్సిపాలిటీలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

అందోల్ మర్చి 8( సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ఇన్చార్జి కే మల్లేశం గౌడ్) సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని జోగిపేట్ మున్సిపాలిటీలో లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల కింద 38 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఎమ్మార్వో మరియు మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ గూడెం మల్లయ్య, 1వ వార్డ్ కౌన్సిలర్ గడ్డి అరుణ్ కుమార్, 12వ వార్డ్ మాజీ కౌన్సిలర్ నాగరాజు, 8వ వార్డ్ కౌన్సిలర్ రత్నం గౌడ్,టీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ గౌడ్, 2వ వార్డ్ కౌన్సిలర్ రాజశేఖర్, 16వ వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్, 18వ వార్డ్ కౌన్సిలర్ అనిల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిట్ల లక్ష్మణ్, మహమ్మద్ సైలని తదితరులు పాల్గొన్నారు.



# ప్రణామ్ డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్య పరీక్షలు

సంగారెడ్డి, మార్చి 8: (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు ఆదివారం ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను సందర్శించి సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీసి మరింత మెరుగుపరచడానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శేషుకర్ మరియు సిబ్బంది సీనియర్ సిటిజన్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారానికి ఒకసారి డే కేర్ సెంటర్‌ను సందర్శించి వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన సలహాలు ఇవ్వాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. సీనియర్ సిటిజన్స్ అందరూ ప్రణామ్ డే కేర్ సెంటర్‌లో సభ్యత్వం పొందుతూ ఈ సేవలను వినియోగించుకోవాలని పత్రికాముఖంగా కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సి. వనజ రెడ్డి, డీడబ్ల్యూఓ లలిత కుమారి మరియు సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.




# సంగారెడ్డి: ఎన్ఎఫ్‌బీఎస్ పథకంపై విస్తృత ప్రచారం చేపట్టాలి – జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 8 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ (ఎన్ఎఫ్‌బీఎస్) పథకంపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య రెవెన్యూ అధికారులకు సూచించారు.కలెక్టర్ తెలిపారు, కుటుంబానికి ప్రధాన ఆర్థిక ఆధారంగా ఉన్న వ్యక్తి మరణించినప్పుడు అర్హులైన బీపీఎల్ కుటుంబాలకు ఒకసారి మాత్రమే రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తారని.మరణించిన వ్యక్తి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి; సహజ మరణం లేదా ప్రమాదవశాత్తు మరణం అయినా పథకం వర్తిస్తుంది.దరఖాస్తుదారులు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బీపీఎల్ లేదా రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలతో ఎంఆర్‌వో/తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు, ప్రచార వాహనాల ద్వారా పథకం వివరాలను ప్రజలకు చేరవేసి అర్హులైన పేద కుటుంబాలు లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.








# మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉంది --ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, మార్చి 8( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళామణులకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణం నుండి దేశ అభివృద్ధి వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం కోసం జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తోందని, మహిళలపై జరిగే నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మహిళల భద్రత కోసం భరోసా సెంటర్, షీ-టీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాధితులకు కౌన్సిలింగ్, మెడికో-లీగల్ సేవలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా షెల్టర్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. గత ఏడాది నమోదైన 281 పోక్సో మరియు అత్యాచార కేసుల్లో బాధితులకు సహాయం అందించడంతో పాటు న్యాయ సహాయం ద్వారా 6 మంది నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో డైల్ 100 లేదా జిల్లా షీ-టీం నెంబర్ 8712565672, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 ను సంప్రదించాలని సూచించారు.



# అప్పుల బాధతో చెరువులో పడి యువకుడు ఆత్మహత్య

మెదక్ మర్చి 8( సందేశం టైమ్స్ అల్లాదుర్గం రూరల్ రిపోటర్ జి కుమార్)మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల్ లో అప్పులు తీర్చలేక మనస్థాపం చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని అప్పాజీపల్లి తండాలో శనివారం జరిగింది. ఎస్సై కుటుంబీకుల కథనం ప్రకారం మండల పరిధిలోని అప్పాజీపల్లి తండాకు చెందిన వడితే అనిల్ ( 27) ఉపాధి కోసం హైదరాబాదులో డ్రైవర్ గా పని చేస్తూ భార్య, కూతురు, కుమారుడుతో జీవనం సాగిస్తున్నాడు. చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ సాగలేక అప్పులు చేయడంతో అప్పుల బాధ ఎలా తీర్చాలో తెలియక ఇటీవల నాలుగు రోజుల క్రితం స్వగ్రామమైన అప్పాజీపల్లి గిరిజన తండాకు చేరుకున్నాడు. నాలుగు రోజులుగా అందరితో కలిసిమెలిసి ఉన్నాడని తాండవాసులు తెలిపారు. చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకుల సమాచారంతో ఎస్సై శంకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నాడు.శనివారం తండా సమీపంలోని గిద్దమ్మ చెరువు కట్టపై. మృతుని బైకు ఉండడంతో పోలీసులు అనుమానంతో గజ ఈతగాలతో చెరువులో గాలించగా మృతుడు అనిల్ ను చెరువులో నుండి పైకి తీశారు. మృతుని భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ వివరించారు

# అమెరికా ఎఫ్‌డిఎ ప్రమాణాలతో 'గ్రావిటీ' ఔషధాలు–ప్రపంచ స్థాయి నమ్మకాన్ని సంపాదించిన గ్రావిటీ ఫార్మా






ఖమ్మం, మార్చి 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అమెరికా ఎఫ్‌డిఎ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన ఔషధాలను తయారు చేస్తున్న గ్రావిటీ ఫార్మా సంస్థ అంతర్జాతీయ స్థాయిలో విశ్వసనీయతను పొందుతోంది. 2014లో హైదరాబాద్ పాషి మైలారంలో స్థాపితమైన సంస్థ, అమెరికా ఫార్మా మార్కెట్‌లో ప్రముఖ ఫార్మసీ చైన్‌లైన వాల్‌గ్రీన్స్, వాల్‌మార్ట్, సీవీఎస్ లో తన ఉత్పత్తులను అందిస్తున్నది.ఇండియాలో 2025 జనవరిలో వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించిన గ్రావిటీ ఫార్మా, సుమారు నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక తయారీ కేంద్రంలో ఏడాదికి 1000 కోట్ల టాబ్లెట్లు తయారు చేస్తోంది. 300 మంది పీహెచ్‌డీ నిపుణులు, 500 మంది ఎం.ఫార్మసీ ప్రొఫెషనల్స్‌తో కూడిన బృందం ఆధునిక పరిశోధన, నాణ్యతా ప్రమాణాలతో సంస్థను ముందుకు తీసుకెళ్తోంది.కార్డియాక్ హెల్త్, డయాబెటిస్ నియంత్రణ, సెంట్రల్ నర్వస్ సిస్టమ్ ఆరోగ్యం, సాధారణ ఆరోగ్యం వంటి విభాగాల్లో గ్రావిటీ పలు ఔషధాలను అందిస్తోంది. మేనేజింగ్ డైరెక్టర్ ధీరజ్ గోరుకంటి, సీఓఓ తిలక్, ఇండియా బిజినెస్ జీఎంలు నరేష్, వినోద్, కృష్ణ కిశోర్, న్యూరో విభాగం జీఎం నరేందర్ నాయకత్వంలో సంస్థ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది.ఈ కార్యక్రమంలో ఖమ్మం న్యూరో సొసైటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె. జగదీష్ బాబు, అధ్యక్షులు డాక్టర్ పి. అసాధారన్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి.వి. మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రూరల్: 10వ తరగతి విద్యార్థుల ఘన వీడ్కోలు సమావేశం



ఖమ్మం రూరల్, మార్చి 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు ఆమంచి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రూరల్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, సర్పంచ్ బండి సతీష్, ఉప సర్పంచ్ షేక్ దావూద్, మాజీ ఏఏపిసి చైర్మన్ పప్పుల విజయ, మాజీ ఎస్ఎమ్‌సి చైర్మన్ పప్పుల రమణ, మాజీ జెడ్పీటీసీ పెరుమాళ్లపల్లి మోహనరావు పాల్గొన్నారు.వారు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రతీ సంవత్సరం కల్పిస్తున్నామని, గత ఏడాది 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నగదు బహుమతులు అందజేసి, ఈ ఏడాది కూడా మంచి ఫలితాలతో గ్రామానికి, గురువులకు, తల్లితండ్రులకు గౌరవాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పప్పుల రమాదేవి ప్రతి సంవత్సరంలాగే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్లు పంపిణీ చేశారు. గత ఏడాది ఉత్తీర్ణత సాధించిన మొదటి, రెండవ, మూడవ స్థానంలోని విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ మోహనరావు రూ.3,500 నగదు బహుమతిగా అందజేశారు. 2వ వార్డు సభ్యులు తంగెళ్లపల్లి నారాయణమ్మ విద్యార్థులకు కంపాస్ బాక్స్, స్కేల్స్, పెన్సిల్స్ అందజేశారు.క్రొత్తగా ఎన్నికైన ఏఏ పిసి చైర్మన్ రమాదేవికి స్వాగతం పలికించి, మాజీ చైర్మన్ విజయకి వీడ్కోలు సన్మానం ఘనంగా నిర్వర్తించబడింది. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగులమీరా, సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాల్, రిటైర్డ్ ఆర్.ఐ కనకయ్య, ఉపాధ్యాయులు సతీష్, పార్వతి, కమల, వార్డు సభ్యులు కందుల భాస్కర్, గుండె తిరపయ్య, మోత్కురి లక్ష్మయ్య, విద్యార్థులు, ఆఫీస్ సబార్డినేట్ రఫీ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ 5వేల కేసుల క్లియరెన్స్ లక్ష్యంతో కొత్త డిజిటల్ పోర్టల్ ప్రారంభం




హైదరాబాద్, మార్చి 8 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజాపాలన-ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.శనివారం సచివాలయంలో మంత్రి శ్రీనివాసరెడ్డి తెలంగాణ హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించి, హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రి గారు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా అధికారులను 99 రోజులలో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, హౌసింగ్ బోర్డు, హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బందికి అంకిత భావంతో పని చేయమని ఆదేశించారు.హౌసింగ్ బోర్డు పరిధిలో ఇండ్లు, ఫ్లాట్లు, స్థలాలను వాయిదాలుగా కొనుగోలు చేసిన దాదాపు ఐదు వేల మంది రిజిస్ట్రేషన్ చేయాల్సినవారిగా అధికారులు వివరించారు. మంత్రిగారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ పూర్తి చేయమని సూచించారు.ఈ కొత్త డిజిటల్ పోర్టల్ ద్వారా ప్రజలకు అధికారులు చుట్టూ తిరిగే అవసరం లేకుండా, రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ, ఇతర లావాదేవీల పర్యవేక్షణ సులభంగా ఒకే వేదికపై పూర్తిగా చేయవచ్చు. మంత్రి గారు తెలిపారు, డిజిటల్ విధానం పారదర్శకతను పెంచి, పౌరులకు సేవలను మరింత చేరువ చేస్తుందని, హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండి వీపి గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాలొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.